క్లుప్తంగా

9న మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 9 వ తేదీ ఎంపీపీ పులగం రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆట పాటల్లోనూ రాణించాలి

కారంచేడు: చిన్నతనం నుంచే విద్యార్థులు చదువులతో పాటు వేసవి సెలవుల్లో ఆటలు, పాటలు, వివిధ రకాల పోటీల్లో రాణించాలని గ్రంథపాలకులు ఎం. నాగయ్య అన్నారు. గురువారం కారంచేడులోని రెండు చెరువుల సెంటర్ వద్ద ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహించారు. వీటిలో కథలు, చరిత్రలు చెప్పడంతో పాటు, వివిధ రకాల ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి గురువారం చల్లాపల్లి శ్రీనివాససరావు ధర్మపత్ని వీరాంజమ్మ రూ.1,00,116 అందజేశారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో గురువారం ఉదయం బాపట్ల ఎంపీ, లోక్ సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ వృద్ధులకు, దివ్యాంగులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యదర్శి సుధాకర్, సర్పంచ్ ఎం, సతీష్ కుమార్ స్థానికులు పాల్గొన్నారు.

కారంచేడు: మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ శ్యాంసన్ అన్నారు. గురువారం కారంచేడు, ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల్లో పింఛన్లు అందించారు.

బల్లికురవ: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు బల్లికురవలోని మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ భరోసా కింద మంజూరైన పింఛన్ సొమ్మును అందజేశారు. ఎంపీడీఓ కుసుమకుమారి స్థానిక నేతలు పాల్గొన్నారు.

కార్డు లేక ప'రేషాన్'


చీరాల తహసీల్దార్ కార్యాలయం


తహసీల్దార్ గోపికృష్ణకు అర్జీలు అందిస్తున్న ప్రజలు (ఫైల్)

- రేషన్ కార్డుల కోసం అర్జీదారులు ఎదురుచూపులు
- ఆదుకోని కూటమి సర్కార్

చీరాల టౌన్: కూటమి ప్రభుత్వంలో పేదల బతుకులకు భరోసా లేకుండా పోతోంది. ప్రతి ఇంటికి రేషన్ కార్డులు అందిస్తాం...భద్రతను ఐదు రెట్లు పెంచుతామంటూ నమ్మబలికిన నాటి ప్రతిపక్ష నేత, నేటి సీఎం చంద్రబాబు తీరా గద్దెనెక్కిన తర్వాత ప్లేటు తిప్పేశాడు. తాను అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా నేటికి ఒక్కటి కూడా నూతన రేషన్ కార్డు అందించలేదంటే చంద్రబాబుకు పేదలపై ఉన్న ప్రేమ ఏ పాటితో అర్థం చేసుకోవచ్చే. ప్రతి పథకానికి, ఆధార్ కార్డుతో పాటు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలకు రేషన్‌కార్డులను తప్పనిసరిగా చేసిన సీఎం.. ఆ కార్డులను మంజూరు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రజలు, అర్జీదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా వ్యయప్రయాసలే తప్ప పేదోడి మొర ఆలకించే దిక్కులేకుండా పోయింది. ఇటీవల పర్చూరు నియోజకవర్గంలోని కొత్తగొల్లపాలెం సభలో సైతం ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్‌కార్డు అందిస్తానని హామీ ఇచ్చిన సీఎం అసలు కొత్త కార్డులు ఇస్తారో....లేదో....అని ప్రజలు ఎదురు చేస్తున్నారు. అలానే ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో ప్రజలు పెడుతున్న అర్జీలైతే కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి కానీ ఏ ఒక్కరికీ ఉపయోగం ఉండటం లేదు. అధికారం వస్తే అది చేస్తాం... ఇది చేస్తాం.... అని చెప్పి సామాన్యుడికి ఆశలు చూపిన తెలుగు దేశం సర్కారు ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమైంది. అధికారం చేతబట్టిన టీడీపీ ప్రభుత్వం 11 నెలల కాలంలో ఒక్కరికి రేషన్‌కార్డు అందించిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో మేమున్నామంటూ ప్రజల ముందుకు వెళుతున్న ఉద్యోగులకు గుండెల్లో దడపుట్టుకొస్తోంది. రేషన్ కార్డుల కోసం తాము ఇచ్చిన అర్జీల విషయంపై ప్రజలు ప్రశ్నించినా, ఎదురుతిరిగినా తాము ఏమి సమాధానం చెప్పాలంటూ అధికార యంత్రాంగం ఆందోళనలకు గురవుతోంది. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో రేషన్ కార్డుల కోసం ప్రజలు ఈ పదకొండు నెలల కాలంలో 982 దరఖాస్తులు అందించారు. రెవెన్యూ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు ఈ అర్జీలను తీసుకుని కార్యాలయంలో కట్టలు కట్టి ఉంచారే తప్ప కనీసం విచారణ కానీ, అర్హత కాని, తిరస్కరణ కూడా చేయలేదు. అలానే వేటపాలెం మండలంలోని 9 పంచాయితీల్లో రేషన్ కార్డుల కోసం 560 అర్జీలు అందించగా వీటిలో ఒక్క అర్హుడికి కూడా రేషన్ కార్డు అందలేదు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం ప్రభుత్వం రేషన్‌కార్డులు విడుదల చేసి ఇస్తేనే ప్రజలకు అందించగలమని, తామేమి చేయలేమని బదులిస్తున్నారు. కనీసం రేషన్ కార్డుల్లో నూతన చేర్పులు, తొలగింపులు కూడా ఇవ్వలేదు. ఫలితంగా చదువుకునే విద్యార్థులు, వివిధ ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారు రేషన్ కార్డుల్లో పేర్లు లేక అష్ట కష్టాలు పడుతున్నారు. చంద్రబాబు చెప్పేది ఒకటి.... చేసేది ఒకటి అని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. నూతన రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తు కాలం వెళ్లదీస్తున్నారు.

> **ఇప్పటికి రెండు సార్లు దరఖాస్తు చేశా**
> నాభర్త కూలి పనులకు వెళ్తుంటాడు. నాకు ఇద్దరు పిల్లలు. మేము వాడరేవు కాలనీలో నివాసం ఉంటాం. రేషన్‌కార్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రేషన్‌కార్డు లేక నివేశన స్థలం కోసం అర్జీలు పెట్టుకోవాలన్నా, ఇతర పథకాలు అందుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నాం. గత ఆరు నెలల్లో రెండు సార్లు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేశా. నేటికీ విచారించలేదు.
> – ఎస్.మరియమ్మ, వాడరేవు

'ఆకాశం'లో పశుగ్రాసం

- వరిసాగు విస్తీర్ణం తగ్గటమే ప్రధాన కారణం
- ట్రక్కు వరిగడ్డి రూ. 15 వేల నుంచి 18 వేలు


బల్లికురవ ప్రాంతం నుంచి పల్నాడు జిల్లాకు తరలిస్తున్న వరి ట్రక్కు

బల్లికురవ: వరిసాగు విస్తీర్ణం ఏడాదికేడాది తగ్గటంతో పశుగ్రాసానికి గిరాకీ పెరుగుతోంది. సాగర్ అద్దంకి బ్రాంచ్ కాలువ పరిధిలో మండలంలోని ముక్తేశ్వరం చెన్నుపల్లి, సూరేపల్లి, వైదన, కొప్పరపాడు, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు కొమ్మినేని వారిపాలెం, అంబడిపూడి గ్రామాల్లో ఖరీఫ్, రబీల్లో వరి సాగు చేపట్టారు. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజూ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు వరిగడ్డి ట్రాక్టర్ ద్వారా ఎగుమతి చేస్తున్నారు. ట్రక్కు వరి గడ్డి రూ. 15 వేల నుంచి 18 వరకు వెచ్చించాల్సి వస్తోందని కొనుగోలు దారులు తెలిపారు. గత ఏడాది ట్రక్కు వరిగడ్డి రూ. 12 వేల నుంచి 15 వేలకు ఇంటికి చేరిందని, ఈ ఏడాది అదనంగా రూ. 17 వేలకు పెరిిందని సాగు విస్తీర్ణం తగ్గంవల్లే గిరాకీతో రేటు పెరిగిందని కొనుగోలుదారులు వివరించారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి


క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎస్ఐ రమేష్

చినగంజాం: శిక్షణ శిబిరాల ద్వారా క్రీడాకారులు చిన్నతనం నుండే క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్ఐ శీలం రమేష్ అన్నారు. స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించే కార్యక్రమానికి హాజరయ్యారు. చినగంజాంలో బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ ద్వారా 100 మంది క్రీడాకారులు కబడ్డీలో శిక్షణ పొందుతున్నారు. వారికి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తన తల్లి యర్రం పిచ్చమ్మ జ్ఞాపకార్థం 70మంది క్రీడాకారులకు క్రీడా దుస్తుల కోసం రూ.25 వేలు నగదు సమకూర్చగా మరో 30 మందికి దాతలు జీటీ అంకిరెడ్డి, చిట్టా మధుసూదన్‌రెడ్డి రూ. 10 వేలు నగదు సమకూర్చి అందజేశారు. సీనియర్ కబడ్డీ, చెడుగుడు క్రీడాకారుడు అట్ల ముసలారెడ్డి, కోచ్ ఎం. గిరిబాబు, పీడీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత కాన్పులు

యద్దనపూడి: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా నిర్వహిస్తామని యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష అన్నారు. యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేసిన కాన్పుల గదిలో గురువారం ఓ మహిళకు కాన్పు చేశారు. వైద్యాధికారి శ్రీహర్ష ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్ డి. ధనలక్ష్మి, పీవీ నరసమ్మ మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన కె. బాల సంజీవనికి ప్రసవం చేశారు. బిడ్డ బరువు 2.5 కేజీలు కలిగి ఆడబిడ్డ ప్రసవం కాగా.. తల్లీబిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. మండల పరిధిలో ఇది తొలి సాధారణ కాన్పని తెలిపారు. ప్రజలు దూరంగా వెళ్ళే సమస్య లేకుండా ఆసుపత్రిలో ప్రసవాలు నిర్వహిస్తున్నామన్నారు.

నాగండ్లలో నేత్ర దానం


దాత కల్లేపల్లి చిట్టిమ్మ

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని నాగండ్లలో కల్లేపల్లి చిట్టిమ్మ(82) మృతి చెందడంతో ఆమె నేత్రాలను బంధువులు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. దాత కుమారుడు వర్మ, రాజు, కుమార్తెలు వెంకట్రావమ్మ, కస్తూరి, పద్మావతి, వెంకట రామరాజుకు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు


మేదరమెట్లలో వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న నాయకులు, అభిమానులు


అద్దంకి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న పార్టీ నాయకులు


అద్దంకి : కేక్ కట్ చేస్తున్న జువ్విరాము

అద్దంకి రూరల్: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా భారీ కేక్‌ను కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి అద్దంకితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బల్లికురవ, సంతమాగులూరు మండల కన్వీనర్‌లు దేవినేని కృష్ణబాబు, పూట్ల నాగేశ్వరరావు, జిల్లా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గునిపూడి రఘురామ గుప్త, కౌన్సిలర్‌లు జబ్బార్, గుంజి కోటేశ్వరరావు, ఉడత్తు సురేష్, కొల్లా భువనేశ్వరి, అభిదా స్థానిక నేతలు పాల్గొన్నారు. అలాగే శింగరకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ జువ్విరాము ఆధ్వర్యంలో గురువారం స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం 500 మందికి మజ్జిగ అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆయన స్వగ్రామం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


పోలేరమ్మ అమ్మవారి మూల విరాట్

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ పరిధిలో పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం పునరుద్ధరణ సందర్భంగా పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలను పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శ్రామికులు.. ఉత్పత్తిదారులు!

- వాడవాడలా మేడే వేడుకలు
- రెపరెపలాడిన ఎర్ర జెండాలు


వేటపాలెంలో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న బేల్దార్ యూనియన్ నాయకులు


అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు


అద్దంకిలో ..


మార్టూరు: బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ధనలక్ష్మి, ముజుందార్ తదితరులు


బల్లికురవలో మేడే వేడుకలు


అద్దంకి: జెండా వందనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు


పర్చూరులో మేడే వేడుకలను నిర్వహిస్తున్న కార్మికులు


కారంచేడులో జెండా ఆవిష్కరణలో నాయకులు, కార్మికులు

మార్టూరు: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో ఎర్ర జెండాలు గురువారం రెపరెపలాడాయి. స్థానిక గన్నవరం సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి ఓపీడీ ఆర్. బాషా తదితర నాయకులు ప్రసంగించారు. స్థానిక నేతాజీ నగర్ కాలనీలోని బొమ్మల సెంటర్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పౌర హక్కుల సంఘం నాయకుడు శిఖనం చిన్నా ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం, సీయూటీయూ ఆధ్వర్యంలో మార్టూరులో ఘనంగా నిర్వహించారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి, జిల్లా నాయకులు మజుందార్, ఆధ్వర్యంలో జండా ఆవిష్కరించి మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామ కోటేశ్వరరావు, టోల్ ప్లాజా యూనియన్ నాయకుడు రాజశేఖర్, బి. సూరిబాబు పాల్గొన్నారు.

కారంచేడు: మేడే స్ఫూర్తితో నేటి కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాల్సి అవసరం ఉందని సీఐటీయూ జిల్లా నాయకులు పి. కొండయ్య అన్నారు. గురువారం మేడే పురస్కరించుకొని మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్‌లో సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరించారు. స్వర్ణ గ్రామంలో జెండా ఆవిష్కరించారు. చీరాల రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో వారు జెండాలను ఎగురవేశారు. సీఐటీయూ నాయకులు చిట్టెమ్మ, రాణి, సుబ్బారావు, లక్ష్మి, శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వేటపాలెం: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఆటో యూనియన్, పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక జెండాలను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. చెక్క రిక్షా కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఉగ్గిరాల నరసింహారావు జండా ఆవిష్కరించారు. జీడిపప్పు ఫ్యాక్టరీల వద్ద కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

చీరాల రూరల్: సమాన పనికి సమాన వేతనాలు పొందటం కార్మికుల హక్కని, వివిధ కంపెనీలు, సంస్థల్లో పనిచేసే కార్మికులను వాటి యాజమాన్యాలు చక్కగా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మిక దినోత్సవాన్ని జాతి, కుల, మత, లింగ, ప్రాంతాల భేదాలు లేకుండా ఎంతో సంతోషంగా ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. పోక్సో చట్టం, లోక్ అదాలత్, బాల కార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం వంటి వాటిపై న్యాయమూర్తి కూలంకషంగా కార్మికులకు వివరించారు. అనంతరం పారిశుద్ధ్య పనుల్లో మెరుగైన సేవలను అందించిన కొందరు కార్మికులకు న్యాయమూర్తి చేతులు మీదుగా శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, కె. దాసు, ఎ. బాబురావు, డి. నాగేశ్వరరావు, పీఎల్‌వీలు ఎస్‌డీ మతిన్, డి. ఇమ్మానుయేలు, జి. సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చీరాల టౌన్: మండల పరిధిలోని దేవాంగపురి, ఈపురుపాలెం, వాడరేవు, తదితర గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఈపురుపాలెంలో మార్కెట్ సెంటర్‌లో మేడే జెండాను ఆవిష్కరించారు. మండలంలోని జాండ్రపేట అయోధ్య నగర్‌లో నిర్వహించారు. నూతనంగా ప్రవేశపెట్టిన కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల సంక్షేమానికి పాలకులు కృషి చేయాలని కోరారు.

అద్దంకి: పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన రోజే మేడే అని చెప్పారు. మేడే వేడుకలను జరిపి శ్రామికులకు మన కృతజ్ఞత తెలుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు దామా రామాంజనేయులు, రాజశేఖర్, ఎస్. హనుమంతరావు, బి. చంద్రశేఖర్, వి. రత్నం, కృష్ణారావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: కార్మికదినోత్సవం సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్, ఆటో కార్మికులు, రిక్షా కార్మికులు, ఫ్రూట్ వెండర్స్, ముఠావర్కర్లు, అన్ని రంగాల కార్మికుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, ఆటో వర్కర్లు, ఫ్రూట్ వెండర్, సివిల్ సప్లయర్స్, మార్కెట్ యార్డు, భవాని సెంటర్‌లో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం డప్పువాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, జీభీష్మా, పి. ఆదాం, ఉసురుపాటి శ్యామ్యూల్, జాను, మారుతి, జ్యోతి వెంకటరావు, అలివేలమ్మ, ఎస్‌కె బాషా తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. వెల్డర్స్, తాపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద బీవీ కృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించారు.

జె.పంగులూరు: ప్రపంచ కార్మికుల దినోత్సవం గురువారం పంగులూరులోని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముస్లిం పేట వద్ద మేడే జెండాను పఠాన్ బాజీ బాబు, అబ్దుల్లాలు ఆవిష్కరించారు. నాగబోయిన రంగారావు, తలపనేని రమారావు, సీఐటీయూ మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, రాయిని వినోద్‌బాబు మాట్లాడారు. కార్మికులకు స్వేచ్ఛ కల్పించడంలో ఎర్రజెండా చేసిన కృషిని వారు కొనియాడారు. ప్రజా కళాకారుడు నందవరపు జాన్ సాహెబ్, నాగాలాండ్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, తలపనేని సుబ్బారావు, గొల్లపూడి నాగేశ్వరావు, కార్మికులు రాజేంద్రబాబు, చిట్టిబాబు, ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: శ్రమ చేసే కార్మికులను గౌరవిస్తు గుర్తింపునివ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అద్దంకి డివిజన్ సీపీఐ కార్యాదర్శి కేఎల్‌డీ ప్రసాద్ అన్నారు. గురువారం బల్లికురవలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆటో వర్కర్స్ యూనియన్, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జరిగాయి. యేసు, మరియబాబు, అజయ్, సీపీఐ మండలశాఖ బాధ్యుడు ఎన్ చిన్నఅప్పారావు, నాగబోయిన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): పర్చూరులో సీఐటీయూ జెండాలను చేత ధరించి వేడుకలలో పాల్గొన్నారు. శ్రమశక్తి పాటలతో నృత్యాలు చేస్తూ గులాములు చల్లుకుంటూ బొమ్మల సెంటర్‌లో సందడి చేశారు.

ఇంకొల్లు(చినగంజాం): సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో తాపీ వర్కర్‌లు, పంచాయతీ వర్కర్‌లు, హమాలీలు, రిక్షా కార్మికులు తదితరులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగాయి. ఇంకొల్లులో జెండాల ఆవిష్కరణ నిర్వహించారు. చినగంజాంలో ఘనంగా నిర్వహించారు.


చీరాల: న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి సుధ


పంగులూరులో మేడే జెండా ఎగురవేస్తున్న కార్మికులు


వేటపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న వామ పక్ష కార్యకర్తలు


ఇంకొల్లులో మేడే వేడుకలు